## క్లుప్తంగా

### కేజీబీవీలో అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన

**మాడుగుల :** మండలంలో డి.సురవరం వద్ద ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ పాఠశాలలో రూ.కోటి 60 లక్షలతో అదనపు భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు స్థానిక ప్రభుత్వాసుపత్రికి మంజూరైన అంబులెన్స్‌ను కూడా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట్ని జయమ్మ, రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల విద్యాశాఖాధికారులు . పాండురంగారావు, బి.దేముడమ్మ, ఎస్‌వో, విజయ, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### కె.జె.పురం జంక్షన్‌లో డ్రైనేజీలు నిర్మించాలి



కె.జె.పురం జంక్షన్‌లో గల ప్రజలు డ్రైనేజ్ నిర్మాణం గురించి తెలియజేస్తున్న దృశ్యం

**మాడుగుల రూరల్ :** మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో డ్రైనేజీలు నిర్మించాలని కోరుతు జంక్షన్‌లో నివసిస్తున్న 150 మంది కుటుంబాల వారు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సురవరంలో కస్తూర్బా బాలికల విద్యాలయం అదనపు భవనాలు ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఎమ్మెల్యేను జంక్షన్‌లో కలిసిన ప్రజలు వినతి పత్రం అందజేశారు. వడ్డాది నుంచి తాటిపర్తి వరకు నిర్మిస్తున్న రహదారి నిర్మాణంలో భాగంగా, కె.జె.పురం జంక్షన్‌లో సుమారు 150 మీటర్లు మేర సిమెంటు రోడ్డు నిర్మించారు.ఈ రోడ్డు ఎత్తుగా ఉండడం వల్ల ఇటీవల కురుస్తున్న వర్షాలకు వర్షపు నీటితో పాటు వాడుక నీరు పోవడానికి మార్గం లేక జంక్షన్‌లో నీరు నిల్వ ఉండి పారిశుధ్యం దెబ్బతింటున్నదని తెలిపారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**బుచ్చెయ్యపేట :** బుచ్చెయ్యపేట మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయలక్ష్మి సోమవారం తెలిపారు. మండల పరిషత్ మీటింగ్ హాలులో ఉదయం పది గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గౌరవ సభ్యులు హాజరుకావాలన్నారు. ఆయా శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు.

### వెర్రిగెడ్డ ఆనకట్టు కాలువలో పూడికతీత పనులు



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**నాతవరం :** ఉపాధి హామీ పథకం నిధులతో 15 పశువులకు నీళ్ల తొట్టెలు నిర్మించామని ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. మండలంలో మర్రిపాలెం శివారు మాధంపూడి గ్రామ సమీపంలో గల వెర్రిగెడ్డ ఆనకట్టు పంట కాలువలో పూడికతీత పనులకు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండవ రిజర్వాయరు నిమ్మకట్టు ఆనకట్టు వెర్రిగెడ్డ ఆనకట్టు పరిధిలో గల ఆయకట్టుకు నీరు ప్రవహించే పంట కాలువలో పూడిక తీత పనులకు ఉపాధి నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, మర్రిపాలెం పెద్ద చెరువు ఆయకట్టు నీటి సంఘం అధ్యక్షుడు రంబా సత్యనారాయణ పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రి నూతన అంబులెన్స్ ప్రారంభం



సురవరం వద్ద అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

**మాడుగుల రూరల్ :** మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి నూతన అంబులెన్స్‌ను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. సురవరంలో కస్తూర్బా బాలికల పాఠశాలకు నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాలు ప్రారంభోత్సవం అనంతరం ఆయన ఈ అంబులెన్స్‌ను లాంఛనంగా ప్రారంభించారు. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ బి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా, రోగులను ఆస్పత్రి నుంచి ఇతర ఆస్పత్రులకు అత్యవసర సమయంలో వైద్య సేవల కోసం ఈ అంబులెన్స్‌ను వినియోగిస్తామని ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్టు కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల దేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, సర్పంచ్ కోట్ని జయమ్మ సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీనాధు సూర్యకాంతంతో పాటు కూటమి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**ఏటా రెండు పంటలకు సాగునీరు అందించాల్సిన జలాశయం వృథాగా దర్శనమిస్తోంది. ఫలితంగా 16 ఏళ్లుగా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందకుండాపోయింది. అయినా పట్టించుకునేవారు లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఏటా వరిసాగుకు దూరమవుతున్నారు. ఈ ఖరీఫ్‌లోనూ తమ భూములకు సాగునీరు ప్రశ్నార్థకమేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.**



నీరు లేకుండా దర్శనమిస్తున్న మామిడిపాలెం రిజర్వాయర్

# నెరవేరని జల ఆశయం

- పూడికతో వృథాగా ఉన్న మామిడిపాలెం జలాశయం
- వర్షాలు కురుస్తున్నా.. నిల్వ ఉండని నీరు
- 16 ఏళ్లుగా ఆయకట్టుకు అందని సాగునీరు
- వరిసాగుకు దూరమైన రైతులు
- ఈ ఖరీఫ్‌లోనూ సాగునీరు ప్రశ్నార్థకమే



మట్టితో కప్పేఉన్న పార్లుకట్ట

**మాకవరపాలెం :** మండలంలోని మామిడిపాలెంలో జాజిగెడ్డ జలాశయం ఉంది. దీనిని 1975 ఏడాదిలో నిర్మించారు. సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ రిజర్వాయర్ ద్వారా మామిడిపాలెం, అడిగర్లపాలెం, రామారాయుడుపాలెం, అప్పన్నదొరపాలెం, కె.తూటిపాల ప్రాంతాల్లో ఉన్న సుమారు 1000 ఎకరాలకు సాగునీరు అందించాల్సిఉంది. కానీ నిర్మించిన అనంతరం కొంతకాలం సక్రమంగానే ఆయకట్టు భూములకు సాగునీరు అందింది. కాల క్రమేణా కొండ గెడ్డల నుంచి వచ్చే నీటితోపాటు మట్టి కొట్టుకురావంతో రిజర్వాయర్ పూడకుపోయింది.

**12 అడుగుల మేర చేరిన పూడిక**

ఈ జలాశయ గర్భంలో సుమారు 12 అడుగుల మేర పూడిక పేరుకుపోయింది. దీంతో ఎంత పెద్ద వర్షాలు కురిసినా రిజర్వాయర్ గర్భంలో ఒక్క చుక్కనీరు కూడా నిల్వ ఉండడం లేదు. ఈ నేపథ్యంలో పై గ్రామాల పరిధిలో ఉన్న వెయ్యి ఎకరాలకు సాగునీరు అందకుండా పోతోంది. చేసేది లేక రైతులు దీర్ఘకాలిక పంటలైన సరుగుడు, జీడి, మామిడి సాగుపైనే దృష్టిసారిస్తున్నారు. ఇక వరి పంటకు పూర్తిగా దూరమవ్వాల్సివచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**పట్టించుకోని ప్రభుత్వం..**

గత టీడీపీ హయాంలో నీరు–చెట్టులో పూడిక తొలగింపునకు సుమారు రూ.40 లక్షలు మంజూరు చేసినా అరకొరగానే పనులు చేసి వదిలేశారని రైతులు చెబుతున్నారు. తీసిన పూడిక మట్టిని రిజర్వాయర్ పార్లు కట్టుపైనే వేసి వదిలేశారని ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో చుట్టుపక్కల రైతులు జలాశయ గర్భాన్ని ఆక్రమించుకుపోతున్నారని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ఈ జలాశయం ఆక్రమణలు తొలగించి, వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

#### మా బాధలు గుర్తించండి



సాగునీరు అందకపోవడం వల్ల కలిగే మా బాధలు గుర్తించండి. 16 ఏళ్లుగా జలాశయం వృథాగా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వమైనా జలాశయంలోని పూడిక తొలగించి, వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– అడిగర్ల అచ్చియ్యనాయుడు, రైతు, అడిగర్లపాలెం

#### వరికి దూరం..



ఈ జలాశయం నుంచి సాగునీరు అందకపోవడంతో వరి పంటకు దూరమయ్యాం. ఏటా రెండుసార్లు వరి పండే మా భూముల్లో దీర్ఘకాలిక పంటలను సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– అడిగర్ల నూకరాజు, రైతు, అడిగర్లపాలెం

## అమర్‌నాథ్‌కు నేతల ఘన సత్కారం



అమర్‌నాథ్‌ని సన్మానిస్తున్న సుంకర శ్రీను, రాజారామ్ తదితరులు

**మాడుగుల రూరల్:** అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన గుడివాడ అమర్‌నాథ్‌ని నియోజకవర్గ పరిధిలో గల పలువురు నాయకులు సోమవారం అనకాపల్లిలో సన్మానించారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం చోడవరం సీడీసీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్తో పాటు మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ అహ్మద్ ఉన్నీసా, నియోజకవర్గ పరిధిలో గల పలువురు ప్రజా ప్రతినిధులు అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

## విస్తృత స్థాయి సమావేశానికి తరలి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న మండల పార్టీ శ్రేణులు

**రావికమతం :** వైఎస్సాసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి రావికమతం మండలం నుండి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, ఎంపీపీ పైల రాజు, పార్టీ కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, వైఎస్సార్ పార్టీ నాయకులు గుమ్ముడి సత్యదేవ, తలారి ఆదిమూర్తి, శీలం శంకర్ , గంటా ఈశ్వరరావు, వైస్ ఎంపీపీలు మత్సా భవానిప్రసాద్, దంట్ల వెంకటరమణ తదితర నాయకులు, పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు అమర్‌ను ఘనంగా సత్కరించారు.

## తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల వినతి



కె.కోటపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

**కె.కోటపాడు :** తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లలో పని చేస్తున్న డ్రైవర్‌లకు కనీస వేతనాలను అమలు చేయాలని వారు కోరారు. ప్రభుత్వ నిబంధల మేరకు కనీస పనికి కనీస వేతనం అమలు చేయాలన్న డిమాండ్‌తో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌లు ఒక్కరోజు సమ్మె చేయాలని రాష్ట్ర యూనియన్ నిర్ణయించిందని డ్రైవర్ యల్లపు బుజ్జి పేర్కొన్నారు. ఈ నెల 20న చేపట్టనున్న ఒక్కరోజు సమ్మెపై కె.కోటపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మికి సోమవారం వినతి పత్రం అందించడం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతు గత 9 ఏళ్లగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లలో తక్కువ వేతనానికి పని చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు గుర్తించి జీతాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌లు ఆడారి నర్సింగరావు, సింగంపల్లి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎం.కోడూరు మోదమాంబ జాతర



ఎం. కోడూరు కళావేదిక మీద మహిళల కోలాటం



ప్రత్యేక అలంకరణలో మోదమాంబ అమ్మవారు

**మాడుగుల రూరల్ :** ఎం.కోడూరు గ్రామ ప్రధాన ఆరాధ్య దైవం, మోదమాంబ అమ్మవారి జాతర ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద నేలవేషాలు, బండ్ల వేషాలు, మహిళలు కోలాటం, కంజీరీ నృత్యాలతో జాతర ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. తర్వాత వర్షం ఆగిపోవడంతో జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఇతర ప్రతినిధులు తగు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జాతర ముగింపు సందర్భంగా భక్తులకు మజ్జిగ, ప్రసాదం దాతలు సహకారంతో అందించారు. ఈ సందర్భంగా గ్రామం అంతా విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు.

## ఊరూరా భూ సమస్యలే

ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చిన ఆర్జీదారులు

**నర్సీపట్నం :** గ్రామ, మండల స్థాయిలో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. డివిజన్ అధికారులపై ఆశతో వృద్ధులు, రైతులు, మహిళలు ఆర్డీవో కార్యాలయానికి సోమవారం తరలివచ్చారు. న్యాయం చేయాలని ఆర్డీవో వి.వి.రమణను వేడుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్ పరిధిలోని 21 ఆర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూమస్యలు ఉన్నాయి. పరిష్కార వేదికలో ఆర్డీవో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తల్లిదండ్రులకు పిత్రార్జితమైన పల్లపు భూమి మాకవరపాలెం మండలం, పైడిపాల రెవెన్యూ పరిధిలో ఉందని రాముతల్లి, వరలక్ష్మి, రవణమ్మ, లక్ష్మి ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. తల్లిదండ్రులు పదేళ్ల క్రితం మరణించారని, అప్పటి నుంచి తాము ఆ భూమిని పంచుకోకుండా సమష్టిగా వ్యవసాయం చేసుకొని అనుభవిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తమ సోదరుడు సత్తిబాబు మాకు తెలియకుండా ఏరకమైన కుటుంబ ధృవీకరణ పత్రం కాని, ఆర్ఓఆర్ క్లెయిమ్‌లు రెవెన్యూ వారికి సమర్పించకుండా తప్పుడు ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో 1బి, అడంగల్‌తో తన పేరున నమోదు చేయించుకున్నట్టు మీ సేవలో 1బి అడంగల్ ద్వారా తెలిసిందన్నారు. శాఖపరమైన విచారణ జరిపించి 1బి, అడంగల్‌ను రద్దు చేయాలని వారు ఆర్డీవోను కోరారు. నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు పక్కన గల వినాయక టవర్స్‌లో లైసెన్స్ లేకుండా మీసేవ సెంటర్‌ను నడుపుతూ, అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని డివిఎస్ఎస్ఎం ప్రభాకర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. సాధారణమైన సమస్యలతో పాటు భూ సమస్యలు అధికంగా వచ్చాయి. పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని ఆర్డీవో డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

## ఓపీఎస్‌ను అమలు చేయాలి



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథ్

**నర్సీపట్నం:** సీపీఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలని ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. ధర్నాను ఉద్దేశించి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.త్రినాథ్ మాట్లాడుతూ ప్రతి నివాస ప్రాంతంలో 1 నుండి 5వ తరగతి వరకు ప్రైమరీ స్కూల్ ఉండాలన్నారు. ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలన్నారు. జీవో 55 ప్రకారం యుపీఎస్, హెచ్‌ఎస్‌లలో స్టాఫ్ పాట్రన్ ఏర్పాటు చేయాలన్నారు. రోల్‌తో నిమిత్తం లేకుండా ప్రతి పాఠశాలకు రెండు ఎస్‌జీటీ పోస్టులు కేటాయించాలన్నారు. 125 పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. రోలుగుంట, మాకవరపాలెం, కోటవురట్ల, నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం మండలాల నుండి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు డి.నూకరాజు, స్టేట్ కౌన్సిలర్ కె.సత్యనారాయణ, ఆర్.వి.దొర, జిల్లా కార్యదర్శులు ఎస్.దాసు, ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, ఆరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మమ్మ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



ప్రారంభమైన లక్ష్మమ్మ ఆలయ నిర్మాణ పనులు

**రోలుగుంట :** స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో మహాలక్ష్మమ్మ ఆలయ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణానికి భక్తులు కూడా తోచిన రూపంలో (నగదు, మెటీరియల్ ,సిమెంటు తదితర) సహకరించాలని ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు విజ్ఞప్తి చేశారు.

## ‘ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు విఫలం’

**దేవరాపల్లి :** మండలంలో ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ఆరోపించారు. గరిసింగి పంచాయతీ పరిధిలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను సోమవారం పరిశీలించినట్టు ఆయన తెలిపారు. పంచాయతీ పరిధిలో గెడ్డలు, వాగులు చదును చేసి ప్రభుత్వ భూమిలో బోరు వేశారన్నారు. మండలంలోని పలు గ్రామాలలో రైతుల నుంచి తక్కువ ధరలకు జిరాయితీ భూములను కొనుగోలు చేసి వాటికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వెంకన్న విమర్శించారు.

## మరిడి మహాలక్ష్మి జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు



మరిడి మహాలక్ష్మి అమ్మవారు

**నర్సీపట్నం :** మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతరకు ఉత్సవ కమిటీ వారు భారీ ఏర్పాట్లు చేశారు. మూడేళ్లకోసారి అమ్మవారి పండగను నిర్వహిస్తారు. ఈ ఏడాది అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సుమారు కిలోమీటరు మేర భారీ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ నెల 7న పెద్ద జాగరణ జరగనుంది. 8న అమ్మవారి పండగను జరుపుకోనున్నారు. జాగరణ రోజున నేల డాన్సులు, థింసా నృత్యాలు, తోలు డప్పులతో డాన్స్‌లు, డాన్స్ బేబీ డాన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 8న ఎడ్ల బళ్ల పోటీలు, సాయంత్రం తీన్‌మార్ డప్పులతో అమ్మవారి ఊరేగింపు, రాత్రికి డాన్స్ హంగామా, మాస్ జాతర, భారీ మందుగుండు సామగ్రి కాల్చడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ముగిసిన డీపీఎల్ క్రికెట్ టోర్నీ



డిపిఎల్ క్రికెట్ టోర్నీ విన్నర్, రన్నర్‌లకు ట్రోఫీలను అందజేస్తున్న భాస్కరరావు తదితరులు

**దేవరాపల్లి:** దేవరాపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్–2 పేరిట నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో నాని టీమ్ విన్నర్‌గాను, నరేష్ టీమ్ రన్నర్‌గా నిలిచాయి. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు వారాలు క్రితం ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. కాగా నాని టీమ్, నరేష్ టీమ్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్ సోమవారం ఉత్కంఠ భరితంగా జరిగింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నాని టీమ్ నిర్ణీత పది ఓవర్లలో 83 పరుగులు చేయగా, నరేష్ టీమ్ పది ఓవర్లలో 83 పరుగులు చేయడంతో ఇరువురి స్కోర్లు సమం అయ్యాయి. దీంతో ఫలితంగా కోసం నిర్వహించిన సూపర్ ఓవర్‌లో నాని టీమ్ విజేతగా నిలిచింది. విజేతలకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రిటైర్డ్ వీడీవో గొల్లు రామ్మూర్తి చేతుల మీదుగా ట్రోఫీ, నగదు బహుమతులను అందజేశారు. విన్నర్ టీమ్‌కు రూ. 15 వేలు, రన్నర్ టీమ్‌కు రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ. 5వేలు, నాలుగో స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ. 3వేలు నగదు బహుమతులను అందజేశారు. టోర్నీ నిర్వహణకు కిలపర్తి భాస్కరరావు, వరదపురెడ్డి లలితానాయుడు, డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కె.వి.రమణ, గండిపడాల అప్పలరాజు, గొర్లి సన్యాసినాయుడు, వాసవీ సెల్ పాయింట్ ప్రతినిధి, దీవి శంకర్ ఆర్థిక సహాయ సహకారాలు అందించారని నిర్వాహకులు పెదిరెడ్ల బాలు, సిహెచ్.నాని, చిత్రాడ సతీష్ తెలిపారు.

### నేడు పెదపైడిమాంబ అమ్మవారి తీర్థం

**కె.కోటపాడు :** చౌడువాడ గ్రామంలో పెడపైడిమాంబ అమ్మవారి తీర్థం మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి ఉదయం నుండే పెద్ద సంఖ్యలో భక్తులు పూజలకు హాజరవుతున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉంటాయన్నారు.

### నేడు జైతవరం అభయాంజనేయ తీర్థం

**చీడికాడ :** మండలంలోని జైతవరంలో వెలసిన అభయాంజనేయ స్వామివారి తీర్థమహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వహకులు తెలిపారు. ఈ మేరకు ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలతో పాటు మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం ఆలయం వద్ద కోలాటంతో నాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి



నిరహారదీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

**చోడవరం :** ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం నిరహారదీక్ష చేపట్టారు. పూర్వపు తాలూకా పరిధిలో ఉన్న అన్ని మండలాల నుంచి ఏపీటీఎఫ్ టీచర్లంతా ఈ నిరసన దీక్షలో పాల్గొన్నారు. విద్యావ్యవస్థలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంలో పడేసేవిధంగా ఉందని ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 117జీఓను రద్దు చేసినప్పటికీ కొత్తగా అమలు చేసేందుకు సిద్ధమౌతున్న విధానాలు ప్రభుత్వ పాఠశాలను మరింత నిర్వీర్యం చేసేలా ఉన్నాయని, అటువంటి విధానాలను యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 1నుంచి 5వ తరగతి వరకూ ఉండే ప్రాథమిక పాఠశాల వ్యవస్థను అదేవిధంగా ఉంచాలన్నారు. విద్యార్థులతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలలో ఇద్దరు ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టులను నియమించాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్తగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, మాతృభాషను యధావిధిగా కొనసాగించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని దశలవారీగా ఉధృతం చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మైచర్ల మహాలక్ష్మినాయుడు చెప్పారు. చోడవరం, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాల నుంచి పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దేముడుబాబు, చోడవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు గొల్లు శ్రీనివాసరావు, కె. మల్లేశ్వరరావు పాల్గొన్నారు.